నిధులు మంజూరు సరే.. పనులెప్పుడు?



అధ్వానంగా ఉన్న వీధి రోడ్డు

- 22వ వార్డులో ముందుకు కదలని అభివృద్ధి పనులు
- అధ్వానంగా రహదారులు, కాలువలు

బీచ్ రోడ్డు: నిధులు మంజూరైనా అభివృద్ధి పనులు ముందుకు సాగకపోవడంతో 22వ వార్డులో రోడ్లు, కాలువలు అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం గడపగడపకు మన ప్రభుత్వం ద్వారా గుర్తించిన సమస్యల పరిష్కారానికి ప్రతి వార్డు సచివాలయానికి రూ.20 లక్షలు కేటాయించింది. వీటిలో అధిక నిధులు రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ మరమ్మతులకు వినియోగించాలి. జీవీఎంసీ 22వ వార్డులోని పలు ప్రాంతాల్లో అధ్వాన రోడ్లు, అస్తవ్యస్త డ్రైనేజీ వ్యవస్థను గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా అధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి స్థానికులు తీసుకెళ్లారు. ఈ మేరకు స్పందించిన జీవీఎంసీ అధికారులు వాటి మరమ్మతులకు నిధులు కేటాయించారు. కానీ ఇప్పటి వరకు పనులు చేపట్టలేదు. దీంతో తమ రోడ్లు, కాలువలకు ఎప్పుడు మోక్షం కలుగుతుందా? అని 22వ వార్డు ప్రజలు ఆశతో ఎదురు చూస్తున్నారు.



కాలువలో నిలిచిన మురుగునీరు

- తార మసీద్ రోడ్డు, మంగాపురం కాలనీ రోడ్డు, చిన్న పోలమాంబ గుడి వీధి రోడ్డు, శివాజీపాలెం కృష్ణుడి గుడి రోడ్డు, సాయిబాబా మందిర రోడ్డును అభివృద్ధి చేయాల్సి ఉంది.
- తార మసీద్ రోడ్డు నుంచి ఎన్టీఆర్ రోడ్డు వరకు, గుడి వీధి నుంచి నబీ రైస్ షాపు వరకు, సవేరా ఫంక్షన్ హాల్ ఎదురుగా ఉన్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీకి మరమ్మతులు చేపట్టాల్సి ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

అధికారుల దృష్టికి సమస్యలు



జీవీఎంసీ 22వ వార్డులో రోడ్లు, డ్రైనేజీల మరమ్మతుల విషయాన్ని జీవీఎంసీ మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, కమిషనర్ రాజాబాబు దృష్టికి తీసుకెళ్లాం. మరమ్మతుల కోసం నిధులు మంజూరు చేశారు. పలు చోట్ల శంకుస్థాపన కూడా చేశారు. కానీ ఇంకా పనులు ప్రారంభించలేదు. ఇదే విషయమై జీవీఎంసీ అధికారుల దృష్టికి మరోసారి తీసుకెళ్లగా.. త్వరలో పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు.

– పీతల గోవింద్, పోలీసు హౌసింగ్ బోర్డు కార్పొరేషన్ డైరెక్టర్

త్వరలోనే పనులు ప్రారంభిస్తాం..

వార్డులో కొన్ని చోట్ల పనులు చేపట్టాం. మిగిలిన రోడ్డు, డ్రైనేజీ పనులను కూడా త్వరలోనే ప్రారంభిస్తాం. పలు పనులకు టెండర్లు పిలవాల్సి ఉంది. టెండర్ల ఫైనల్స్ అయ్యాక వెంటనే పనులు చేపడతాం.

– శ్రీనివాస్, ఏఈ, జీవీఎంసీ

క్లుప్తంగా

ఫిషర్‌మెన్ కాలనీలో వితరణ



నిత్యావసర సరకులు అందిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

ఎంవీపీ కాలనీ: స్థానిక ఫిషర్‌మెన్ కాలనీలో లయన్స్ క్లబ్ ద్వారకా నగర్ ఆధ్వర్యంలో ఆదివారం పేదలకు నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. ఇక్కడి ప్రాథమిక పాఠశాల ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ గవర్నర్ ఎల్.ఎస్.ఉషారాజు ముఖ్యఅతిథిగా పాల్గొని బియ్యం, పప్పులు, నూనెలతో కూడిన సరకుల కిట్‌ను అందజేశారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించారు. విద్యార్థులకు ఫ్రూట్స్, బిస్కెట్స్, చాక్లెట్స్ అందించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ఉపాధ్యక్షుడు జీబీ కుమార్, కార్యదర్శి పేర్ల భాస్కరరావు, స్కూల్ హెచ్‌ఎం సత్యవేణి, తదితరులు పాల్గొన్నారు.

నేత్ర విద్యాలయానికి సరకుల పంపిణీ



నేత్ర విద్యాలయానికి సరకులు అందిస్తున్న నిత్యావసర సరకులు

ఎంవీపీ కాలనీ: స్థానిక శ్రీవేంకటేశ్వరస్వామి, ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భీమిలి బీచ్ రోడ్డులోని నేత్ర విద్యాలయానికి నిత్యావసర సరకులు అందజేశారు. శ్రీచినజీయర్ స్వామి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ నేత్ర విద్యాలయానికి తరచూ ఈ కమిటీ సభ్యులు సరకులు అందజేస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా భక్తుల ద్వారా సేకరించిన నిధులతో సుమారు రూ.35 వేలు విలువ చేసే ఆహార పదార్థాలు, సరకులను విద్యాలయం ప్రతినిధులకు ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ కార్యదర్శి ప్రసాదరావు, సభ్యులు జగన్ మోహన్, గౌరీశంకర్, లక్ష్మీనారాయణ, అర్చకులు లక్ష్మణస్వామి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సీతారామ సేవా సంఘం కార్యవర్గం ఎన్నిక



పూజలు చేస్తున్న సీతారామా సేవ సంఘం నూతన కార్యవర్గ సభ్యులు

మద్దిలపాలెం: జీవీఎంసీ 15వ వార్డు పాత వెంకోజీపాలెంలో శ్రీసీతారామ సేవా సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం జరిగింది. సంఘం అధ్యక్షుడిగా బి.విశ్వనాథం, ఉపాధ్యక్షుడిగా వి.వెంకటరావు, ప్రధాన కార్యదర్శిగా కె.అప్పలరాజు, కార్యదర్శిగా ఆడారి శివ ప్రకాష్, సహాయ కార్యదర్శిగా కె.రఘు, ఎ.రమణ, ఆర్.సురేష్ ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ సభ్యులు రామాలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

ఎర్నిమాంబకు అభిషేకాలు



విశేష అలంకరణలో అమ్మవారు

కంచరపాలెం: జ్ఞానాపురంలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయంలో ఫాల్గుణ మాసం ద్వాదశి ఆదివారాన్ని పురస్కరించుకుని భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ నేతృత్వంలో పూజారి శ్రీకాంత్ శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు, నిర్వహించారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలు ఏర్పాటు చేశారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన భక్తులు సరైన నీడ లేక వర్షానికి తడిసి ముద్దయిపోయారు.

ఆధ్యాత్మిక సాధనతో మానసిక శాంతి



ఆరండ్‌మార్గ్ ఆశ్రమంలో యోగా చేస్తున్న సాధకులు



ఉపన్యసిస్తున్న ఆనంద్‌మార్గ్ ఆచార్య జ్యోతి ప్రకాష్

ఆరిలోవ: యాంత్రిక జీవనంలో ఆధ్యాత్మిక సాధనతోనే మానసిక శాంతి లభిస్తుందని ఆనంద్‌మార్గ్ సీనియర్ ఆచార్య జ్యోతి ప్రకాష్ అవధూత తెలిపారు. జీవీఎంసీ 10వ వార్డు పరిధి డెయిరీ ఫారం దరి ఇందిరానగర్‌లోని ఆనంద్‌మార్గ్ ఆశ్రమంలో మూడు రోజులుగా జరుగుతున్న జాతీయ ఆధ్యాత్మిక సదస్సు ఆదివారం ముగిసింది. ఈ సదస్సులో వివిధ రాష్ట్రాలలో ఆనంద్‌మార్గ్ ఆశ్రమాల నుంచి వచ్చిన ఆచార్యులు ఇక్కడ ఉచిత యోగా, ధ్యానం, ఆధ్యాత్మిక ఉపన్యాసాలు చేశారు. వారితో పాటు నగరానికి చెందిన కొందరు సాధకులు కూడా ఈ శిబిరంలో పాల్గొని యోగా సాధన చేశారు. ముగింపు సందర్భంగా ఆచార్య జ్యోతి ప్రకాష్ మాట్లాడుతూ మనిషి సంపూర్ణ ఎదుగుదలకు ఆధ్యాత్మిక సాధనతో పాటు సామాజిక సేవలు కూడా అవసరమన్నారు. మూడు రోజుల పాటు నిర్వహించిన ఈ ఆధ్యాత్మిక సదస్సులో వివిధ రాష్ట్రాల నుంచి 50 మంది సన్యాసులు, మరో 150 మంది ఆనంద్‌మార్గ్ ఆశ్రమాల సభ్యులు పాల్గొన్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆచార్య పరమేశ్వర ఆనంద్ అవధూత, సౌమ్యానంద్, సుశ్రుతానంద్, ఇష్టప్రేమ, అనిమిష ఆనంద్, శుచిలేక ఆనంద్ పాల్గొన్నారు.

ఏయూ సమాచారమ్

జాతీయ సమైక్యత శిబిరానికి ఏయూ విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ సమైక్యత శిబిరానికి ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యార్థులు తరలి వెళ్లారు. డాక్టర్ వీఎస్ కృష్ణా కళాశాలకు చెందిన అధ్యాపకుడు డాక్టర్ పి.ఉమామహేశ్వరరావు ప్రోగ్రాం అధికారిగా ఎనిమిది మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఒడిశా రాష్ట్రం పూరీలో ఈ నెల 25వ తేదీ వరకు నిర్వహించే జాతీయ సమైక్యత శిబిరంలో ఏయూ ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా వారిని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి ఆచార్య ఎస్.హరనాథ్, తదితరులు పాల్గొన్నారు.

విదేశీ విద్యార్థులకు నేత్ర పరీక్షలు



విద్యార్థులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం విదేశీ విద్యార్థినుల వసతి గృహంలో ఆదివారం ఉచిత నేత్ర వైద్య పరీక్ష శిబిరం నిర్వహించారు. ఎంవీపీ కాలనీలోని వసతిగృహంలోని విద్యార్థినులకు నేత్ర పరీక్షలు చేసి, అవసరమైన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో చీఫ్ వార్డెన్ ఆచార్య సిహెచ్.ఆశా ఇమ్మానియేల్‌రాజు, వార్డెన్ డాక్టర్ రాజమాణిక్యం, తదితరులు పాల్గొన్నారు.

ఆకర్షణీయంగా ‘ఐ లవ్ వైజాగ్’



సీతకొండ మలుపులో బీచ్‌రోడ్డు సీ వ్యూ వద్ద జీవీఎంసీ ఏర్పాటు చేసిన ఐ లవ్ వైజాగ్ బోర్డు

ఆరిలోవ: విశాలాక్షినగర్ దరి సీతకొండ మలుపు వద్ద బీచ్‌రోడ్డులో జీవీఎంసీ ఏర్పాటు చేస్తున్న ‘ఐ లవ్ వైజాగ్’ ఆకర్షణీయంగా నిలుస్తోంది. నగరంలో ఈ నెల 28, 29 తేదీలలో జరగనున్న జీ–20 సదస్సుల కోసం విశాఖ రానున్న వివిధ దేశాల ప్రతినిధులను ఆకట్టుకొనేలా నగరాన్ని సుందరీకరణ చేస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా బీచ్‌రోడ్డును అందంగా తీర్చిదిద్దుతున్నారు. సీతకొండ మలుపు వద్ద సీ వ్యూ పాయింట్‌లో ఐ లవ్ వైజాగ్ అనే విడి అక్షరాలను అమర్చారు. ఈ బోర్డులో రెండు డాల్ఫిన్ బొమ్మలను లవ్ సింబల్‌గా ఉపయోగించారు. వాటి కింద రంగులు వేయడానికి ప్రస్తుతం పలకలు అమర్చుతున్నారు. దీంతో ఈ బోర్డు అటుగా వెళ్లే వాహనచోదకులు, సందర్శకులను ఆకట్టుకుంటోంది. వారు అక్కడ ఆగి సెల్ఫీలు, ఫొటోలు తీసుకుంటున్నారు.

ఆకట్టుకున్న తెలుగు సాహితీ సభ



సాహితీ ప్రసంగం చేస్తున్న ప్రముఖ వక్త నృసింహా శర్మ

మద్దిలపాలెం: విశాఖ మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో కళాభారతిలో ఆదివారం జరిగిన తెలుగు సాహితీ సభ ఆకట్టుకుంది. ఈ సభను వీఎండీఏ ప్రతినిధులు ఎమ్మెస్ఎన్ రాజు, గుమ్ములూరి రాంబాబు, శేఖర మంత్రి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం డాక్టర్ గుమ్ములూరి ఇందిరా అధ్యక్షతన వసంత కవనం సాహితీ ప్రసంగాన్ని ప్రముఖ వక్త రాంభట్ల నృసింహ శర్మ చేశారు. వసంతం కోకిల ప్రప్రథమంగా కూస్తూ, పచ్చదనాన్ని ఆహ్లాదకరమైన వాతావరణాన్ని తీసుకువస్తుందన్నారు. సభాధ్యక్షురాలు డాక్టర్ ఇందిరా మాట్లాడుతూ రాబోయే రుతువు వసంతమని తెలిపారు. అనంతరం గుమ్ములూరి రాంబాబు మాట్లాడుతూ ఏప్రిల్ 12 నుంచి 16వ తేదీ వరకూ పైడా కౌశిక్ నాటకోత్సవాలను నిర్వహించనున్నామన్నారు.

ఉద్యోగులకు గుర్తింపుతోనే సంస్థ అభివృద్ధి



కార్యక్రమంలో పాల్గొన్న పార్థసారథి, తదితరులు

బీచ్ రోడ్డు: ఉద్యోగులకు తగిన గుర్తింపునిస్తే ఆ సంస్థ అభివృద్ధి శరవేగంగా జరుగుతుందని ఒడిశా రాష్ట్రం చీఫ్ సెక్రటరీ పార్థసారథి అన్నారు. నగరంలోని ఓ హోటల్‌లో టెక్ విజన్ సాఫ్ట్‌వేర్ కంపెనీ తమ ఉద్యోగులకు ఊర్జా పేరిట ఆదివారం అవార్డుల ప్రదానోత్సవాన్ని ఘనంగా నిర్వహించింది. ఈ వేడుకకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన పార్థసారథి మాట్లాడుతూ 2009లో స్థాపించిన ఈ కంపెనీ అమెరికా, కెనడా, యూకే, ఆస్ట్రేలియా వంటి దేశాల్లో కార్యకలాపాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. హైదరాబాద్ బ్రాంచి ఆపరేషన్ డైరెక్టర్ ఉన్నికృష్ణన్ మాట్లాడుతూ సిబ్బందిని ప్రోత్సహిస్తూ ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ అసోసియేట్ డైరెక్టర్ హేమంత్ కుమార్, దాన్ తౌర, గ్రోస్ మోథాన్, జెమ్స్ మే, తదితురలు పాల్గొన్నారు..

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్‌ఐ వెంకటరావు

సీతమ్మధార: ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీ షీటర్లకు సీఐ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ఎస్ఐ వెంకటరావు కౌన్సెలింగ్ నిర్వహించారు. రౌడీ షీటర్లకు ఎస్ఐ పలు సూచనలిచ్చారు. వారి దినచర్య గురించి అడిగి తెలుసుకున్నారు. సమాజంలో ఎటువంటి అల్లర్లు చేయకుండా ఉండాలని, కుటుంబ సభ్యులతో కలిసి హాయిగా జీవించాలని సూచించారు. ఎలాంటి నేరాలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీస్ నిఘా ఎల్లప్పుడూ ఉంటుందని గుర్తించుకుని మంచిగా నడుచుకోవాలని రౌడీ షీటర్లకు ఎస్ఐ వెంకటరావు సూచించారు.

రోడ్డు మధ్యలో నిలిపేస్తున్న ఆర్టీసీ బస్సులు



మద్దిలపాలెం బస్టాప్ వద్ద నడిరోడ్డుపై నిలిపివేసిన బస్సు

మద్దిలపాలెం: నగరంలో నిర్దేశించిన బస్టాప్‌ల వద్ద కాకుండా నడిరోడ్డుపై పలువురు ఆర్టీసీ డ్రైవర్లు బస్సులను ఆపి ప్రయాణికులను దింపేస్తున్నారు. దీంతో ప్రయాణికులు బెంబేలెత్తిపోతున్నారు. బస్సు రోడ్డు మధ్యలో నిలిచిపోవడంతో కొద్ది సేపు ట్రాఫిక్ కూడా స్తంభించిపోతోంది. మరో వైపు నడిరోడ్డుపై ఆపిన బస్సుకు ఇరువైపులా ద్విచక్ర వాహనచోదకులు రయ్‌రయ్‌మంటూ వెళ్లడంతో ఆ బస్సులోంచి దిగిన ప్రయాణికులు బిక్కుబిక్కుమంటూ రోడ్డు దాటుతున్న పరిస్థితులు నెలకొన్నాయి. బస్సు ఎక్కే ప్రయాణికులు కూడా ఇబ్బందులు పడుతున్నారు. నిబంధనల ప్రకారం నిర్దేశించిన స్టాప్‌నకు దగ్గరగా బస్సులు ఆపి సురక్షితంగా ప్రయాణికులను దింపాల్సి ఉంది. కానీ ఇవేవీ పట్టని కొందరు డ్రైవర్లు తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ రోడ్డు మధ్యలో నిలిపేస్తుండడంపై ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్సులను స్టాప్‌ల వద్ద ఆగేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

మహిళల రక్షణకు పోష్ చట్టం



మాట్లాడుతున్న డాక్టర్ ఉషా

సీతంపేట: పనిచేసే ప్రదేశాల్లో మహిళలపై వేధింపులు జరగకుండా, వాటి నుంచి రక్షించడానికి భారత ప్రభుత్వం పీవోఎస్‌హెచ్(పోష్) చట్టాన్ని రూపొందించిందని సీఐఐ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ ఉషా పంతుల అన్నారు. ఫ్యూచర్ ఆఫ్ వర్క్ స్పేసెస్ అనే అంశంపై డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాలలో ఆదివారం జరిగిన అవగాహన సదస్సులో ఆమె ప్రసంగించారు. పోష్ చట్టం గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. మహిళా ఉద్యోగులకు సురక్షితమైన పని వాతావరణం కల్పించడం యజమానులకు ఈ చట్టం తప్పనిసరి చేస్తుందన్నారు. లైంగిక వేధింపుల ఫిర్యాదులను పరిష్కరించడానికి సంస్థల్లో అంతర్గత ఫిర్యాదుల కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు. మహిళలతో అభ్యంతరకరంగా మాట్లాడిన చట్టం ప్రకారం నేరంగా పరిగణిస్తారని చెప్పారు. చట్టం పరిధిలోకి వచ్చే అంశాలు, ఎలా ఫిర్యాదు చేయాలి, ఏ విధంగా రక్షణ పొందాలి తదితర అంశాలపై డాక్టర్ ఉషా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బుల్లయ్య కళాశాల ప్రిన్సిపాల్ డి.దీపక్ చౌదరి, వి.రాధాదేవి, శివజ్యోతి, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

ముస్లిం వివాహ పరిచయ వేదికకు స్పందన



పరిచయ వేదిక కార్యక్రమంలో పాల్గొన్న ముస్లిం వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 42వ వార్డు రైల్వే న్యూకాలనీలోని హోటల్ సింకా గ్రాండ్‌లో ముస్లిం వెల్ఫేర్ సొసైటీ చైర్మన్ హైదర్ ఆలీ సింకా ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత ముస్లిం వివాహ పరిచయ వేదిక నిర్వహించారు. నగరంతోపాటు ఉమ్మడి విశాఖ జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో ముస్లిం కుటుంబాలు పాల్గొన్నాయి. వధూవరుల తల్లిదండ్రులు వారికి కావలసిన అర్హతలను బట్టి తమ పిల్లలకు సంబంధాలను ఏర్పాటు చేసుకున్నారు. హైదర్ ఆలీ సింకా మాట్లాడుతూ వివాహ పరిచయ వేదికలను ఇప్పటి వరకు మూడు సార్లు ఏర్పాటు చేశామని, ఇది నాలుగోదని తెలిపారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన వారికి ఉచితంగా భోజన సదుపాయం కల్పించామని, కార్యక్రమానికి మంచి స్పందన వచ్చిందన్నారు. అర్హులైన పేద కుటుంబాలకు తమ సొసైటీ తరపున షాదీ ఖర్చులు కూడా భరించి ఉచితంగా వివాహాలు జరిపించేందుకు కమిటీ నిర్ణయించిందని చెప్పారు.

వక్ఫ్ బోర్డు చైర్మన్‌కు సత్కారం

ఇటీవల విశాఖ జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్‌గా నియమితుడైన వైఎస్సార్‌సీపీ నాయకుడు కె.వి.బాబాను సొసైటీ ప్రతినిధులు, ముస్లిం పెద్దలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు మీర్ అబ్బాస్ హుస్సేన్, సయ్యద్ అమీర్ జాన్, మహబూబ్ అలీఖాన్, షేక్ అహ్మద్ వల్లీ, షేక్ అబ్దుల్ మునీర్, మహమ్మద్ రహమతుల్లా తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి నూకాంబిక అమ్మవారి ఉత్సవాలు

అల్లిపురం: కొత్త అమావాస్య సందర్భంగా కొబ్బరితోట, నేతాజీనగర్‌లో ఉన్న నూకాంబిక అమ్మవారి ఆలయాల్లో సోమ, మంగళవారాల్లో ఘనంగా ఉత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సోమవారం తొలేళ్ల ఉత్సవం, ఘటాల ఊరేగింపులు జరగుతాయన్నారు. ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలియజేశారు.

చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న కుమార్

డాబాగార్డెన్స్: మహాత్మాగాంధీ నేషనల్ రూరల్ ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ పథకం కింద నెలకు 200 రోజులు పని కల్పిస్తూ, రోజుకు రూ.600 కనీస వేతనం ఇవ్వాలని సిటూ ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ డిమాండ్ చేశారు. సిటూ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాణ్యమైన చదువు, వైద్యం, నిత్యావసర సరకులు అందించాలని, ప్రభుత్వరంగ పరిశ్రమలను అమ్మే ఆలోచనను బీజేపీ ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని, నాలుగు కార్మిక కోడ్‌లు రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, కనీస పెన్షన్ రూ.10 వేలు చెల్లించాలంటూ ఏప్రిల్ 5న తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. బీజేపీ ప్రభుత్వం కార్మిక వర్గంపై దాడి చేస్తుందని, రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వడం లేదని, దేశంలో ప్రభుత్వరంగ పరిశ్రమలను అమ్మేస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో ఎస్, జ్యోతీశ్వరరావు, పి. వెంకట్‌రెడ్డి, కుమార మంగళం, బి. జగన్ పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళల వనభోజనాలు



వన భోజనాలకు తరలి వెళుతున్న డ్వాక్రా మహిళలు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు సత్యసాయి నగర్ కొండవాలు ప్రాంతం డ్వాక్రా మహిళలు, స్థానికులు ఆదివారం వన భోజన మహోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఉచితంగా బస్సు ఏర్పాటు చేయగా, వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కంపా హనోకు, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పైడి రమణ తమ వంతు సహకరించినట్లు సత్యసాయినగర్ కాలనీ అధ్యక్షుడు రాజుయాదవ్ తెలిపారు.

మాతృమూర్తులకు సన్మానం



మాతృమూర్తులను సత్కరిస్తున్న గీతా మకరందం సభ్యులు

డాబాగార్డెన్స్: విశాఖపట్నం పోర్టు ట్రస్ట్ ట్రాఫిక్ విభాగం డీహెచ్‌టీకి చెందిన గీతా మకరందం సభ్యులు సీహెచ్ మసేను, నక్కా అప్పారావు, జి. ధనరాజు గత ఐదేళ్లుగా మాతృమూర్తుల సన్మాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా ఆదివారం మాతృమూర్తులను సన్మానించారు. బి. దేవుడు, డి. ఎల్లారావు, నర్సింగరావు, పిల్లి రమణ, వాసుపల్లి కోదండరావు, పోలవరపు నూకాలమ్మ దంపతులతో పాటు 40 మంది మాతృమూర్తులను ఘనంగా సత్కరించారు. మాతృదేవోభవ పేరిట జరిగిన ఈ కార్యక్రమం అనంతరం అన్నసమారాధన చేపట్టారు. స్వామి వివేకానంద సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

తెలుగు పాటకు ఆస్కార్ గొప్ప విషయం



కార్యక్రమంలో పాల్గొన్న కళాసేవా పీఠం సభ్యులు

గోపాలపట్నం: ఆర్‌ఆర్‌ఆర్ సినిమాలో నాటు నాటు పాటకు ఆస్కార్ అవార్డు రావడం సంతోషించదగ్గ విషయమని గోపాలపట్నం కళా సేవా పీఠం అధ్యక్షుడు గొరకల రామదాసు అన్నారు. గోపాలపట్నంలోని పీఠం కార్యాలయంలో ఆదివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఆస్కార్‌తో తెలుగు చిత్ర కీర్తి విశ్వ వ్యాప్తమైందన్నారు. సభ్యులు జి.అప్పారావు, డి.సింహాచలం నాయుడు, వెంకట్, శ్రీనివాసరావు, నూక రాజేశ్వరరావు, రామచంద్రరావు పాల్గొన్నారు.